క్లుప్తంగా

రామన్‌పాడులో పెరిగిన నీటిమట్టం

మదనాపురం: మండలంలోని రామన్‌పాడు జలాశయంలో శనివారం నీటిమట్టం కాస్త పెరిగింది. శుక్రవారం 1016 అడుగులు ఉండగా.. శనివారం 1,017 అడుగులకు చేరినట్లు ఏఈఈ వరప్రసాద్ తెలిపారు. జూరాల కుడి, ఎడమ కాల్వల్లో నీటి సరఫరా లేదని.. రామన్‌పాడు కుడి, ఎడమ కాల్వలకు 12 క్యూసెక్కులు, తాగునీటి అవసరాలకు 20 క్యూసెక్కులు వినియోగిస్తున్నట్లు ఆయన వివరించారు.

ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన విద్య



వనపర్తి రూరల్: ప్రభుత్వ పాఠశాలలో మెరుగైన విద్యతో పాటు పుస్తకాలు, భోజనం, దుస్తులు ఉచితంగా అందిస్తారని హెచ్‌ఎం గణేష్‌కుమార్ అన్నారు. బడిబాట కార్యక్రమంలో భాగంగా శనివారం మండలంలోని చిట్యాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులతో కలిసి శనివారం గ్రామంలో ఇంటింటికి తిరుగుతూ విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడారు. పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని తల్లిదండ్రులను కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సిద్దిరవి, మహమ్మద్, షఫీ, శ్రీనివాసులు పాల్గొన్నారు.

స్నేహితుడి కుటుంబానికి ఆర్థికసాయం



వనపర్తి రూరల్: శ్రీరంగాపురం మండల కేంద్రానికి చెందిన షౌకత్ అలీ (ఆర్టీసీ డ్రైవర్) ఇటీవల్ల అనారోగ్యంతో మృతి చెందాడు. ఈ విషయం తెలుసుకున్న 1991–92 పదో తరగతి స్నేహితులు శనివారం రూ.50 వేలు అందజేశారు. స్నేహితుడి కుటుంబానికి అండగా ఉంటామని పేర్కొన్నారు. కార్యక్రమంలో తోటి స్నేహితులు బుచ్చన్న, కురుమయ్య, ఎల్లస్వామి, శాంతిభూషన్, అరుణ, మేదమ్మ, రజియా, చెన్నయ్య, జలీల్, కృష్ణ, విష్ణు, మన్యం, చంద్రశేఖర్, నిరంజన్, రామకృష్ణ, వెంకటయ్య, తదితరులు పాల్గొన్నారు.

● పాన్‌గల్: మండలంలోని బండపల్లి గ్రామంలో మృతిచెందిన సూరమ్మ కుటుంబాన్ని శనివారం కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, మాజీ జెడ్పీటీసీ రాంమ్మూర్తినాయుడు పరామర్శించి రూ.5వేలు ఆర్థికసాయం అందజేశారు.

అంగన్‌వాడీలో అన్నప్రాసన



అమరచింత: పట్టణంలోని 5వ అంగన్‌వాడీ కేంద్రంలో శనివారం అన్న ప్రాసన కార్యక్రమం నిర్వహించి చిన్నారులకు అక్షరాభ్యాసం చేపట్టారు. అమ్మమాట–అంగన్‌వాడీ బాట కార్యక్రమంలో భాగంగా మండలంలోని ఆయా గ్రామాల్లో అంగన్‌వాడీ కేంద్రాలలో మూడేళ్ల చిన్నారులను బడిలో చేర్పించుకుంటున్నారు. ఈమేరకు కొత్తగా అంగన్‌వాడీ కేంద్రాలకు వస్తున్న చిన్నారులకు పూలతో స్వాగతం పలుకుతున్నామని అంగన్‌వాడీ టీచర్‌లు తెలిపారు.

మహాధర్నాను జయప్రదం చేయండి

ఆత్మకూర్: ఆపరేషన్ కగార్ పేరిట కొనసాగిస్తున్న హత్యాకాండను వెంటనే నిలిపేసి మోదీ ప్రభుత్వం కాల్పుల విరమణ ప్రకటించి మావోయిస్టు పార్టీతో బేషరతుగా శాంతి చర్చలు జరపాలని సీపీఐ జిల్లా నాయకుడు శ్రీహరి అన్నారు. ఈ నెల 17న హైదరాబాద్‌లోని ఇందిర పార్కువద్ద నిర్వహిస్తున్న మహాధర్నా పోస్టర్లను ఆయన విడుదల చేసి మాట్లాడారు. అడవులను, ఖనిజ సంపదను దోచుకునేందుకే ఆపరేషన్ కగార్ చేపడుతున్నారని, సంపదను కార్పొరేట్ శక్తులకు అప్పజెప్పేందుకు కుట్రలు పన్నుతున్నారని ఆరోపించారు. మహాధర్నాలో ప్రజలు వేలాదిగా పాల్గొనాలని పిలుపునిచ్చారు.

రైతుభరోసాకు దరఖాస్తు చేసుకోవాలి

పాన్‌గల్: జూన్ 6వ తేదీ వరకు భూములు కొనుగోలు చేసి పట్టాపాసు పుస్తకాలు వచ్చిన రైతులందరు వానాకాలం రైతు భరోసా పథకానికి దరఖాస్తు చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి రాజవర్ధన్‌రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. రైతులు పట్టాదారు పాసుపుస్తకం, ఆధార్‌కార్డు జిరాక్స్, సేవింగ్ బ్యాంక్ అకౌంట్ పుస్తకం, తహసీల్దార్ డిజిటల్ సంతకం చేసిన జిరాక్స్, రైతు దరఖాస్తు ఫారమ్‌ను నింపి ఆయా గ్రామాల ఏఈఓలకు ఈనెల 20వ తేదీ వరకు అందజేయాలని ఆయన పేర్కొన్నారు.

శిథిలావస్థలో పాఠశాల భవనం

- అసంపూర్తిగా నూతన గదుల నిర్మాణం
- విద్యార్థులు ఎక్కువ.. తరగతి గదులు తక్కువ
- నాగల్‌కడ్మూర్‌లో ఒకే చోట ఉన్నత, ప్రాథమిక పాఠశాలలు



ఒకే కాంపౌండ్‌లో కొనసాగుతున్న ప్రైమరీ, ఉన్నత పాఠశాల

అమరచింత: గత విద్యాసంవత్సరంలో మన ఊరు–మనబడి కార్యక్రమం ద్వారా నాగల్‌కడ్మూర్ ప్రభుత్వ ఉన్నత, ప్రాథమిక పాఠశాలలో రూ.10 లక్షలతో చేపట్టిన తరగతి గదుల పైకప్పు పెచ్చులూడుతోంది. దీంతో విద్యార్థులతో పాటు ఉపాధ్యాయులు ఎప్పుడు ఎలాంటి ప్రమాదం సంభవిస్తుందోనని భయంతో పాఠశాలకు హాజరవుతున్నా పరిస్థితి ఏర్పడింది. ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు మౌలిక వసతులతో పాటు తరగతి గదులను సంఖ్యకు అనుగుణంగా ఏర్పాటు చేస్తున్నామని ప్రభుత్వం ప్రకటనలు చేస్తున్నా, ఇక్కడ మాత్రం సరైన తరగతి గదులు లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. నాగల్ కడ్మూర్‌లోని ప్రభుత్వ పాఠశాలలో ఉన్నత, ప్రాథమిక పాఠశాలలు ఒకే కాంపౌండ్‌లో కొనసాగుతున్నాయి. ప్రైమరీ తరగతి కోసం రెండు గదులు, ఉన్నత పాఠశాల కోసం 3 గదులు ఉండటంతో విద్యార్థుల విద్యబోధన అయోమయంగా కొనసాగుతోంది. ప్రాథమిక పాఠశాలలో 1 నుంచి 5 వరకు 87 మంది, 6 నుంచి 10 వరకు 100 మంది విద్యార్థులున్నారు. సరైన గదులు లేకపోవడంతో రెండు గదులను ఒకే గదిలో ఏర్పాటు చేసి పాఠాలను బోధించే పరిస్థితి దాపురించింది. గత ఎస్‌ఎస్‌సీ ఫలితాల్లో పదో తరగతి విద్యార్థులు అనుకున్న స్థాయిలో ఉత్తీర్ణత సాధించలేక పోయారని పాఠశాల ఉపాధ్యాయుల చెబుతున్నారు. చాలీ చాలని గదుల కారణంగా చదువు ముందుకు సాగడం లేదనే ఆరోపణలు సైతం వినిపిస్తున్నాయి.

పాఠశాల నిర్మాణానికి స్థలం ఉచితం..

గ్రామంలో ఉన్నత పాఠశాల నిర్మాణం కోసం అమ్మాపురం సంస్థానాదీశుడు శ్రీరాంభూపాల్ స్థలాన్ని ఉచితంగా ఇవ్వడంతో అప్పటి కలెక్టర్ స్వేతామహంతి రూ.10 లక్షలు మంజూరు చేశారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో అదనపు గదుల కోసం నిధులు ఇవ్వాలని పలుమార్లు ప్రతిపాదనలు పంపినా నిధులు మంజూరు కాలేదు. మూడేళ్ల క్రితం డైనింగ్ హాలుకు రూ.18 లక్షలు మంజూరు కావడంతో నిర్మాణ పనులు చేపట్టారు. కాంట్రాక్టర్ పూర్తి స్థాయిలో బిల్లులు రాలేదని వాటికి తలుపులు, కిటికీలు ఏర్పాటు చేయలేదు. పూర్తయిన రెండు తరగతి గదులకు సైతం పెయింటింగ్ పనులు చేయలేదు. దీంతో అవి మరుగున పడ్డాయి. ఈజీఎస్ ద్వారా కొత్తగా నిర్మించే ఉన్నత పాఠశాల ఆవరణలోనే మరుగుదొడ్డి, కిచెన్‌షెడ్ కోసం రూ.7.5 లక్షలు మంజూరు కాగా, పనులు చేస్తున్న బిల్లులు రాకపోవడంతో మధ్యలోనే నిలిపేశారు. దీంతో గ్రామంలో కొన్ని సంవత్సరాల నుంచి నిర్మాణంలో ఉన్న ఉన్నత పాఠశాల భవనాలు నేటికీ అసంపూర్తిగానే ఉన్నాయి. ఇరుకైన గదులలో చదువులు కొనసాగించలేని దుస్థితి ఏర్పడింది.



అసంపూర్తిగా ఉన్న ఉన్నత పాఠశాల భవనాలు



పెచ్చులూడిన తరగతి గది పైకప్పు.

పెచ్చులూడుతున్నాయి..



గతేడాది మన ఊరు–మన బడి ద్వారా తరగతి గదులకు మరమ్మతు చేశారు. ప్రస్తుతం అవి పెచ్చులూడుతున్నాయి. పాఠశాల తెరవక ముందే పెచ్చులూడి పడటంతో ప్రమాదం తప్పినట్లైంది. ప్రాథమిక, ఉన్నత పాఠశాలలు ఒకే కాంపౌండ్‌లోని ఐదు గదులలో నిర్వహించడంతో విద్యార్థులతో పాటు ఉపాధ్యాయులు ఇబ్బంది పడుతున్నారు. మంత్రి స్పందించి సమస్యను పరిష్కరించాలి.

– బాబు, నాగల్‌కడ్మూర్

మంత్రి దృష్టికి తీసుకెళ్లాం..



గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో నెలకొన్న సమస్యలతో పాటు నూతన పాఠశాల భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని మంత్రి వాకిటి శ్రీహరి దృష్టికి తీసుకెళ్లాం. సమస్యను అర్థం చేసుకున్న మంత్రి త్వరలోనే నిధులు మంజూరు చేసి సమస్య పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

– జగన్‌రెడ్డి, నాగల్ కడ్మూర్

కిచెన్‌షెడ్ బిల్లులు అందాలి..

గ్రామంలో నిర్మిస్తున్న ఉన్నత పాఠశాల భవన సముదాయంలో ఇప్పటి వరకు బిల్లులు చెల్లించే విషయం గతంలో విధులు నిర్వహించిన ఏఈఈ ధర్మరాజుకు తెలుసు. ప్రస్తుతం తన పరిధిలో డైనింగ్‌హల్, మరుగుదొడ్లు, వంట గది నిర్మాణ పనులు జరిగాయి. వాటికి సంబంధించిన రూ.7.5 లక్షలు చెల్లించాల్సి ఉంది.

– నరేష్ ఏఈ

క్రీడా పాఠశాలల్లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

పాన్‌గల్: రాష్ట్రంలోని హకీంపేట, కరీంనగర్, ఆదిలాబాద్‌లో ఉన్న ప్రభుత్వ క్రీడా పాఠశాలల్లో 2025–26వ సంవత్సరానికి 4వ తరగతిలో ప్రవేశానికి అర్హులైన విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఎంఈఓ శ్రీనివాసులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆయా క్రీడా పాఠశాలల్లో ప్రవేశానికి మూడు అంచెల్లో ఎంపిక ప్రక్రియ ఉంటుందని ఆయన పేర్కొన్నారు. మండల స్థాయిలో ఈనెల 19న ఉంటుందని, ఆసక్తి గల విద్యార్థులు మండల స్థాయిలో జరిగే ఎంపికలో పాల్గొనాలన్నారు. మరిన్ని వివరాల కోసం ఆయా గ్రామాల హెచ్‌ఎంలను గాని, మండల స్థాయిలో ఎంఈఓను గాని సంప్రదించాలన్నారు.

విప్లవ వీరుడు చే గువేరా



వనపర్తిటౌన్: ప్రపంచ మానవాళికి చేగువేరా విప్లవ పోరాటాలు ఆదర్శనీయమని, మహనీయుల స్ఫూర్తివేదిక రాష్ట్ర చైర్మన్ రాజారామ్‌ప్రకాశ్ అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని చేగువేరా జయంతి వేడుకలను మహనీయుల స్ఫూర్తివేదిక ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ మేరకు చేగువేరా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా చేగువేరా పోరాటాలను, జీవిత చరిత్రను వివరించారు. కార్యక్రమంలో కవి డాక్టర్ నాయకంటి నరసింహశర్మ, బాలేమియా, నాయకులు మండ్ల దేవన్న నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

రక్తదానంతో సంపూర్ణ ఆరోగ్యం



రక్తదాతలను సన్మానిస్తున్న సాహితీ కళా వేదిక ప్రతినిధులు

వనపర్తిటౌన్: ఆపద సమయంలో ఉన్న వారికి రక్తదానం పునర్జన్మను ప్రసాదించే సంజీవనిలా సహాయపడుతుందని సాహితీ కళా వేదిక జిల్లా అధ్యక్షుడు పలుస శంకర్‌గౌడ్, జిల్లా సమన్వయకర్త బైరోజు చంద్రశేఖర్ అన్నారు. ప్రపంచ రక్తదాతల దినోత్సవం సందర్భంగా పలువురు రక్తదాతలను సాహితీ కళా వేదిక ఆధ్వర్యంలో శనివారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్షతగాత్రులకు, రక్తహీనత కల్గినవారికి రక్తదానం ఊపిరినిస్తుందన్నారు. రక్తదానం చేయడం ప్రతి ఒక్కరూ సామాజిక కర్తవ్యంగా భావించాలన్నారు. తయారు చేయలేని రక్తాన్నీ, ఒకరు దానిమిస్తేనే తీసుకోగలం, కాబట్టి ప్రతి ఒక్కరు రక్తదానం మీద అవగాహన పెంచుకోవాలన్నారు. రక్తదానం చేసే వారు పూర్తి ఆరోగ్యవంతులుగా ఉంటారు తప్ప, క్షీణించే ప్రసక్తే ఉండదన్నారు. రక్తదానం చేసిన ఐదు రోజుల్లోనే నూతన రక్తం శరీరంలో వృద్ధి చెందుతుందన్నారు. ప్రతి మనిషిలో 5 లీటర్ల రక్తం ఉంటుందని, రక్తదానం మూలంగా కేవలం 150 నుంచి 250 ఎమ్‌ఎల్ మాత్రమే ఇతరుల ప్రాణాలను నిలుపుతుతుందనే విషయాన్ని మరువరాదన్నారు. అదే విధంగా బీజేపీ పట్టణాధ్యక్షుడు రాజశేఖర్‌గౌడ్ ఆధ్వర్యంలో రక్తదాతలు పోచ రవీందర్ రెడ్డి, ప్రవీణ్‌కుమార్, మురళి, రాము, రాజులను సన్మానించారు. సాహితీ కళా వేదిక ప్రతినిధులు చంద్రశేఖర్, గణేష్‌కుమార్, రాములు, అరవింద్, చిన్న పవన్, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

ఇచ్చిన హామీ అమలు చేయాలి



మాట్లాడుతున్న సీపీఐ నాయకులు

అమరచింత: ఎన్నికల ముందు జూనియర్ కళాశాలను ఏర్పాటు చేస్తామని ఇచ్చిన హామీని ఎమ్మెల్యేగా గెలిచి నేటికి అమలు చేయలేదని, ప్రస్తుతం మంత్రిగా బాధ్యతలు తీసుకున్న వాకిటి శ్రీహరి ఇప్పటికైనా హామీని నెరవేర్చాలని సీపీఐ పట్టణ కార్యదర్శి రవీందర్ కోరారు. శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. మండలం ఏర్పడి సంవత్సరాలు గడుస్తున్నా గత పాలకులు జూనియర్ కాలేజీని ఏర్పాటు చేయలేక పోయారని, కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనైనా జూనియర్ ఇంటర్ తరగతులు ఈ విద్య సంవత్సరంలో ప్రారంభమయ్యేలా మంత్రి చొరవ చూపాలన్నారు. మండలంలో అత్యధికంగా బీడీ కార్మికులు, వ్యవసాయ, చేనేత కార్మికులున్నారని, ఆర్థిక స్థోమత లేక పిల్లలను పైచదువులకు పంపడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. ఇచ్చిన హామీని అమలు చేయాలని, లేకపోతే ఆందోళన చేపడతామన్నారు. కార్యక్రమంలో భాస్కర్, శ్యాంసుందర్, లక్ష్మీనారాయణ, ఇజ్రాయిల్ పాల్గొన్నారు.

బియ్యం పంపిణీలో అవకతవకలు అరికట్టాలి



వనపర్తిలోని బండార్‌నగర్ రేషన్ షాపు దగ్గర మాట్లాడుతున్న నాయకులు

వనపర్తి రూరల్: రేషన్ బియ్యం పంపిణీలో అవకతవకలు జరుగుతున్నాయని, వెంటనే వాటి అరికట్టాలని సీపీఐ పట్టణ కార్యదర్శి జె రమేష్, జిల్లా కౌన్సిల్ సభ్యులు గోపాలకృష్ణ కోరారు. శనివారం వనపర్తి పట్టణంలో బండార్ నగర్ రేషన్ షాపును వారు సందర్శించి బియ్యం పంపిణీని పరిశీలించారు. వినియోగదారుల ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్టాక్ పాయింట్ల నుంచి రేషన్ దుకాణాలకు సక్రమంగా బియ్యం సరఫరా చేయక పలు దుకాణాలు మూతపడ్డాయన్నారు. రేషన్ కార్డులు పట్టుకొని ప్రజలు బియ్యం కోసం షాపుల చుట్టూ తిరుగుతున్నారన్నారు. పతిసారి అరకిలో బియ్యం తరుగు తీస్తున్నారు. ఇదేమి అని లబ్ధిదారులు ప్రశ్నిస్తే మాకు సరఫరా చేస్తున్న బియ్యం సంచులు తరుగు వస్తుందని చెపుతున్నారన్నారు. ఈ నెల జారీ అయిన అన్ని రేషన్ కార్డులకు బియ్యం పంపిణీ చేయాలని అధికారులను కోరారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు ఎర్ర కురుమన్న, తదితరులు పాల్గొన్నారు.

ఫొటోగ్రాఫర్ల సమస్యలు పరిష్కరించాలి



నాగరాజుకు నగదు అందజేస్తున్న ఫొటోగ్రాఫర్లు

ఆత్మకూర్: ఫొటో గ్రాఫర్ల సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం పరిష్కరించాలని, సంక్షేమ పథకాలను వర్తింపజేయాలని ఫొటోగ్రాఫర్ల సంఘం అధ్యక్షుడు మన్యం, ఉపాధ్యక్షుడు నవీన శ్రీను, ప్రధాన కార్యదర్శి తౌఫీక్ కోరారు. శనివారం ఫొటోస్టూడియోల నిర్వాహకులు సమావేశంలో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్లు, ఇతర సంక్షేమ పథకాలు వర్తింపజేయడంతో పాటు అత్యాధునిక కెమెరాలు ఉచితంగా ఇవ్వాలని, రూ.10 లక్షల సబ్సిడీ రుణాలు ఇవ్వాలని, రూ.25 లక్షల బీమా సౌకర్యం కల్పించాలని కోరారు. ఇటీవల తిప్డంపల్లి గ్రామానికి చెందిన ఫొటోగ్రాఫర్ నాగరాజు నివాస గృహం వర్షాలకు కూలిపోవడంతో రూ.10 వేలు అందజేశారు. కార్యక్రమంలో సంఘం నాయకులు శ్రీరాములు, జగన్, తిరుపతి, అనీల్, ప్రసాద్, రంజిత్, లక్ష్మణ్, రాజశేఖర్, వెంకట్రాములు, ప్రేమ్‌కుమార్, నరేష్, రవి, నర్సింహ, ఖాజీ, శ్రీనివాసులు ఉన్నారు.

ఆకతాయిలపై చర్యలు తీసుకోవాలి

గోపాల్‌పేట: నాలుగు రోజుల క్రితం మండలంలోని పొలికెపాడు గ్రామంలో బస్టాండులో ఉన్న మహాత్మాగాంధీ విగ్రహాన్ని గుర్తుతెలియని దుండగులు చేతికర్ర, చేయి, కాలును ధ్వంసం చేశారు. ఈ విషయంపై శనివారం పొలికెపాడు గ్రామానికి చెందిన యువకులు ఆవేదన వ్యక్తం చేశారు. పోలీసులు ఇటువంటి పనులు చేసే వారికి తగిన శిక్ష పడేలా చూడాలని కోరారు. గ్రామంలో కొన్నిసార్లు ఎక్కడ పడితే అక్కడ మద్యం తాగి బాటిళ్లు రోడ్లపై వేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే పోలీసులు తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. గ్రామంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తే ఎవరు ఈ పనులు చేస్తున్నారనే విషయాలు తెలుస్తాయని, సీసీ కెమెరాలు ఏర్పాటు చేసేందుకు ముందుకు రావాలని కోరారు. కార్యక్రమంలో మాజీ ఉపసర్పంచు మునీంద్ర, గద్దెరాములు, చంద్రయ్య, లింగం బుచ్చయ్య, కృష్ణయ్య పాల్గొన్నారు.

వనపర్తి వాసులకు డాక్టరేట్



వనపర్తిటౌన్: వనపర్తి పట్టణంలో వివిధ సేవా కార్యక్రమాలు చేస్తున్న కంటె నిరంజనయ్య, బండారి శ్రీనివాసులు శనివారం హైదరాబాద్‌లో డాక్టరేట్ పురస్కారం అందుకున్నట్లు విలేకరులకు తెలిపారు. గ్లోబల్ హ్యూమన్ రైట్స్ ట్రస్ట్ జాతీయ సంస్థ 4వ వార్షికోత్సవం సందర్భంగా హైదరాబాద్‌లోని బషీర్‌భాగ్ ప్రెస్‌క్లబ్‌లో నిరంజనయ్య, బండారు శ్రీనివాసులుకు ఏషియన్ ఇంటర్నేషనల్ యూనివర్సిటీ మణిపూర్ తరపున డాక్టరేట్ అందజేసినట్లు వెల్లడించారు. డాక్టరేట్ ప్రదానోత్సవంలో ఓపెన్ స్కూల్ తెలంగాణ డైరెక్టర్ డాక్టర్ సయ్యద్ ఫాతిమా, హెచ్‌ఆర్‌టీ చైర్మన్ రహమాన్ ఉన్నారు. హ్యూమన్ రైట్స్ రాష్ట్ర కార్యదర్శులుగా నిరంజనయ్య, శ్రీనివాసులును నియమించారు.

రైల్వే క్వార్టర్స్‌లో వ్యక్తి మృతదేహం



మదనపురం: మదనాపురం మండల కేంద్రంలోని రైల్వే క్వార్టర్స్‌లో ఓ వ్యక్తి మృతదేహం లభ్యమైన సంఘటన శనివారం వెలుగులోకి వచ్చింది. ఎస్‌ఐ శేఖర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. రైల్వే క్వార్టర్స్‌లో దుర్గంధపు వాసన వస్తుండడంతో పరిసర ప్రాంతంలో ఇంటి నిర్మాణ పనుల కోసం వచ్చిన కూలీలు వెళ్లి చూడగా, ఓ వ్యక్తి మృతదేహం కనిపించింది. దీంతో వారు వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. సంఘటనా స్థలానికి పోలీసులు వెళ్లి పరిశీలించగా, లభ్యమైన సెల్‌ఫోన్ ఆధారంగా మండల కేంద్రానికి చెందిన ఇసుముల శ్రీనివాసులు(42), వృత్తి పెయింటర్ గుర్తించారు. వారం రోజుల క్రితం మరణించి ఉండవచ్చని పేర్కొన్నారు. కుటుంబ సభ్యులకు సమాచారం అందించగా, భార్య హారిక ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన



తడి, పొడి చెత్తపై అవగాహన కల్పిస్తున్న కమిషనర్ ఎస్.వెంకటేశ్వర్లు

ఆత్మకూర్: ఇటీవల కురుస్తున్న వర్షాలకు సీజనల్ వ్యాధులు ప్రబల్లే అవకాశాలున్నాయని, ప్రతి ఒక్కరు అప్రమత్తంగా ఉండాలని కమిషనర్ శశిధర్ అన్నారు. శనివారం ఆత్మకూర్ మున్సిపాలిటీ కేంద్రంలో 100 రోజుల ప్రణాళిక కార్యక్రమాల్లో భాగంగా స్థానికులకు అవగాహన కల్పించారు. దోమలు వ్యాప్తి చెందకుండా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, దోమలు కుట్టకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వార్డుల అధికారులు, సిబ్బంది, కార్మికులు పాల్గొన్నారు.

అమరచింత: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకునేందుకు పట్టణ ప్రజలు స్వచ్ఛందంగా ముందుకు రావాలని ఇన్‌చార్జి మున్సిపల్ కమిషనర్ శశిధర్ కోరారు. 100 రోజుల ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని 8వ వార్డులో మురుగు కాల్వల శుభ్రత, పాతటొట్టిలలో నిల్వఉన్న వర్షపు నీటిని తొలగించడం, బ్లీచింగ్ చల్లడం వంటి కార్యక్రమాలు చేపట్టారు. చందూల్ బీడీ ఫ్యాక్టరీ ముందు అపరిశుభ్రంగా ఉన్న చెత్త చెదారం తొలగించి ముగ్గులు వేసి పూలను చల్లారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షకాలంలో పరిసరాలు అపరిశుభ్రంగా ఉంటే ప్రజలు రోగాల బారిన పడే అవకాశం ఉండదన్నారు. మురుగు నిల్వలను గుర్తించి వాటిని తొలగించుకోవాలన్నారు. కార్యక్రమంలో వార్డు ఆఫీసర్లు, మెప్మా సిబ్బంది, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

వీధులను శుభ్రంగా ఉంచుకుందాం

వనపర్తిటౌన్: ప్రజలు వీధులను, కాలనీలను శుభ్రంగా ఉంచుకోవడంలో భాగస్వాములు కావాలని మున్సిపల్ కమిషనర్ ఎస్.వెంకటేశ్వర్లు అన్నారు. 100 రోజుల కార్యాచరణలో భాగంగా శనివారం పుర వీధుల్లో ఇంటింటి చెత్త సేకరణపై అవగాహన కల్పించారు. డ్రెయినేజీల్లోని మురుగును దగ్గరుండి తీయించి కాల్వలను శుభ్రం చేయించారు. 10వ, వార్డులో పందుల బెడద ఎక్కువ ఉందనే ప్రజల ఫిర్యాదుకు స్పందించిన కమిషనర్ సిబ్బందికి ఆదేశా లు ఇవ్వడంతో పందుల యజమానులతో మాట్లాడి పందులను పట్టించారు. పందుల బెడద తీరడంతో ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఉమా మహేశ్వర్‌రెడ్డి, వార్డు ఆఫీసర్ నరేష్, ఆర్పీఎస్ ఎస్‌హెచ్‌జీ మెంబర్స్, సిబ్బంది పాల్గొన్నారు.

ఖిల్లాఘనపురం వాసికి సేవా పురస్కారం



గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మతో పురస్కారం అందుకుంటున్న కాగితాల మధు

ఖిల్లాఘనపురం: మండల కేంద్రానికి చెందిన కాగితాల మధుకు ఉత్తమ సేవా పురస్కారం లభించింది. శనివారం ప్రపంచ రక్తదాతల దినోత్సవాన్ని పురస్కరించుకొని హైదరాబాద్ రాజ్‌భవన్‌లో గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ మధుకు అవార్డును అందజేశారు. మధు యువశక్తి ఫౌండేషన్ స్థాపించి రక్తదానంపై రాష్ట్రవ్యాప్తంగా యువతను చైతన్యం చేయడంతో పాటు నేటి వరకు రాష్ట్రవ్యాప్తంగా 30 వేల మందికి ఫౌండేషన్ ద్వారా రక్తదానం చేశారు. ఆయన సేవలను గుర్తించి గవర్నర్ అభినందించి పురస్కారం అందించారు. ఈ సందర్భంగా మధు మాట్లాడుతూ.. సేవా దృక్పథంతో యువశక్తి ఫౌండేషన్ ఏర్పాటు చేసినట్లు వివరించారు. తనకు సహకారం అందించిన ప్రజలు, యువశక్తి ఫౌండేషన్ కుటుంబ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు.

నీట్‌లో స్కాలర్స్ విద్యార్థుల జయకేతం



నీట్‌లో విద్యార్థులను అభినందిస్తున్న స్కాలర్స్ కళాశాల యాజమాన్యం, లెక్చరర్స్ బృందం

వనపర్తి విద్యావిభాగం: వెలువడిన నీట్–2025 ప్రవేశ పరీక్ష ఫలితాల్లో వనపర్తి స్కాలర్స్ విద్యాసంస్థల విద్యార్థులు విజయ ఢంకా మోగించి సంచనం సృష్టించారు. స్కాలర్స్ జూనియర్ కళాశాల విద్యార్థులు జాతీయ స్థాయిలో ర్యాంకులు సాధించి మెడిషిన్ సీట్లు ఖాయం చేసుకున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ ఏ.శ్రీధర్ తెలిపారు. రెగ్యూలర్ ఇంటర్‌తో పాటు మొదటి ప్రయత్నంలోనే షాహిస్తా, తహినియత్–545 మార్కులు సాధించడంతో పాటు కె.మహేందర్–415 మార్కులు, టి.ప్రవంత్‌రెడ్డి–393 మార్కులు సాధించి జాతీయ స్థాయి ప్రవేశ పరీక్షల్లో ప్రతిభ కనబర్చారు. నీట్‌లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులను స్కాలర్స్ కళాశాల యాజమాన్యం పూలమాలలు వేసి శాలువాలతో ఘనంగా సన్మానించింది. భవిష్యత్‌లో ఉన్నత శిఖరాలు అధిరోహించి తల్లిదండ్రులకు, తాము చదివిన విద్యాసంస్థలకు పేరు ప్రతిష్టలు తీసుకురావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో డాక్టర్ పి.జగదీశ్వర్, డాక్టర్ జి.వరప్రసాద్‌రావు, డాక్టర్ బి.నాగేశ్వర్‌రెడ్డి, డాక్టర్ ఎల్.సత్యానారాయణరెడ్డి, బి.మధుసూదన్‌గుప్తా, లెక్చరర్స్ ఉన్నారు.

సమస్యల పరిష్కారానికి పోరాటం : సీపీఎం



మాట్లాడుతున్న ఎండీ జబ్బార్

పాన్‌గల్: ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రజలతో కలిసి కార్యకర్తలు నిరంతరం పోరాటాలు కొనసాగించాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు ఎండీ జబ్బార్ పిలుపునిచ్చారు. శనివారం మండలంలోని రేమద్దులలో రెండ్రోజుల పాటు నిర్వహించే పార్టీ జిల్లా శిక్షణా తరగతులను పార్టీ జెండా ఆవిష్కరించి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పార్టీ ప్రజల పక్షాన నిలబడి భూమి, భుక్తి, విముక్తి కోసం రాజీలేని పోరాటాలు కొనసాగించిందన్నారు. కార్మికులు, కర్షకులు, నిరుద్యోగులు, రైతులు, విద్యార్థులు, మహిళలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి వారి పక్షాన ఉంటూ పోరాటాలు చేపట్టాలని పిలుపునిచ్చారు. ప్రజా సమస్యలపై పోరాడుతూనే పార్టీ బలోపేతానికి సంఘటితంగా పనిచేయాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలని కోరారు. అమరులైన పార్టీ నాయకులకు నివాళులు అర్పించారు. శిక్షణ తరగతులకు పాన్‌గల్, వీపనగండ్ల, చిన్నంబావి, ఏదుల మండలాలకు చెందిన పార్టీ కార్యకర్తలు, నాయకులు హాజరయ్యారు. సమావేశంలో పార్టీ జిల్లా నాయకులు బాల్‌రెడ్డి, పుట్టా ఆంజనేయులు, మండల కార్యదర్శి బాల్యానాయక్, వెంకటయ్య, వేణుగోపాల్, భగత్, వెంకటయ్య, రాము, ఆయా మండలాల పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.